బాధ్యతగా ఓటేద్దాం..

- యువతా మేలుకో..
  ఓటు నమోదు చేసుకో...
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం ఓటు.. ఐదేళ్లకోసారి దేశ భవిష్యత్తును నిర్ణయించేదీ ఈ ఓటే. కాబట్టి 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదైతే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. నేడు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు నమోదు, ఆవశ్యకతపై ప్రత్యేక కథనం..

మేడ్చల్ రూరల్: జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటైన రోజు. అయితే, భారత ఎన్నికల సంఘం 1950లోనే ఏర్పడినప్పటికీ 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 6 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికలప్పుడు ఓటరు కార్డు ఉందో లేదో చూసుకోకపోవడం.. నూతనంగా ఓటు నమోదు చేసుకోకపోవడంతో ప్రతిసారి చాలా మందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత లభిస్తుంది. కానీ, చాలా మంది యువత నమోదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నేడు(గురువారం) జాతీయ ఓటరు దినోత్సవం కావడంతో ప్రతి గ్రామంలోని బూత్ స్థాయి కార్యాలయాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు.

నమోదు ప్రక్రియ ఇలా..

01 జనవరి 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. బూత్ లెవల్ అధికారులు లేదా తహశీల్దార్ కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాలలో ఓటరు నమోదుకు ఫామ్–6 అందుబాటులో ఉంటుంది. ఒక ఫొటోతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ లేదా ఏదైనా పుట్టిన తేదీ ధృవపత్రంతో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. అయితే, ఇప్పటికే ఓటరుకార్డులు ఉన్నవారు పేరు, అడ్రసు తదితర మార్పులు చేర్పుల కోసం ఫామ్–7, ఫామ్–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకొని.. ప్రింట్ తీసుకొని తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలి. అనంతరం అధికారులు విచారణ చేసి ఓటరు కార్డు మంజూరు చేస్తారు. ఆపై ఓటరుకార్డు నేరుగా లేదా మీసేవ ద్వారా పొందవచ్చు.



పూడూర్‌లో బూత్ కేంద్రం వద్ద ఓటు నమోదు చేసుకునేందుకు దరఖాస్తుపత్రాలు నింపుతున్న యువత(ఫైల్)



మేడ్చల్‌లో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ తీస్తున్న విద్యార్థులు(ఫైల్)

ఎన్నికల ఏడాది కావడంతో..

ఇటీవల రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగగా, త్వరలో పార్లమెంట్ ఆ తర్వాత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వరుసగా జరగనున్నాయి. ఈక్రమంలో ఓటరు నమోదుకు కొంతమేర స్పందన లభిస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఓటు విలువపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత. 18 ఏళ్లు దాటిన యువత ఎప్పుడైనా ఓటు నమోదు చేసుకోవచ్చు. గ్రామాల్లో అందుబాటులో ఉండే బూత్ స్థాయి సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవచ్చు. లేదంటే వెబ్‌సైట్ నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

– శైలజ, తహశీల్దార్, మేడ్చల్

జేఎన్‌టీయూహెచ్ బేస్‌బాల్ జట్టు ఎంపిక



ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కాలేజీ(వీబీఐటీ)లో జేఎన్‌టీయూహెచ్ బేస్‌బాల్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ ఎస్ఎస్ దిలీప్ హాజరయ్యారు. ఈక్రమంలో పలు కళాశాలలకు చెందిన క్రీడాకారులను జేఎన్‌టీయూ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జేఎన్‌టీయూహెచ్ పీడీలు అశోక్, వంశీ, వీబీఐటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, మోహన్, శ్యామ్, గోవర్ధన్, రమేశ్, నరేశ్, శివలాల్, వెంకటేశ్, పాషా పాల్గొన్నారు.

బాలికలకు నోట్ బుక్స్ పంపిణీ



పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మేడ్చల్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నాయకులు బాలికలకు నోట్ బుక్స్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పిసరి మహిపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల రాహుల్‌యాదవ్, నాయకులు రాకేశ్, శ్రీధర్, శశి, విజయ్, ఆశిష్, కౌశిక్, వినయ్, రాంప్రసాద్, సుమంత్, చేతన్ పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీన్ రాజారెడ్డి

మేడ్చల్ రూరల్: శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయంతో పాటు ఆధునిక సాగుపై నైపుణ్యం పొందాలని మల్లారెడ్డి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని అగ్రికల్చర్ కళాశాలలో యువతకు 'డిఫ్యూడియన్ ఆఫ్ ఇన్నోవేషన్స్ మరియు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ'పై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామీణ యువతకు స్టార్టప్స్, హైడ్రోపోనిక్స్, సాఫ్ట్ స్కిల్స్, ఇన్‌క్యుబేషన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హార్టికల్చర్ సీనియర్ ప్రొఫెసర్లు మనోహర్, సుభాష్‌రెడ్డి, శివశంకర్.. ఉద్యానవన అంశాలు, వ్యాపార నైపుణ్యత, కోల్డ్ స్టోరేజీ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌పాల్‌రెడ్డి

మేడ్చల్: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని విశ్రాంత ఆర్టీఏ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. బైక్ నడిపే సమయంలో హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. కార్యక్రమంలో నీలం సంపత్, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, గణేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

డిజటల్ క్లాసుల కోసం పరికరాలు అందజేత



పరికరాలను విరాళంగా ఇచ్చిన సభ్యులు

కీసర: స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిజిటల్ క్లాసులతో పాటు మేడ్చల్ బడి.కామ్ క్లాసుల నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు ఏర్పాటయ్యాయి. బుధవారం చీర్యాల గీతాంజలీ కళాశాల, హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థ ఆధ్వర్యంలో వీటిని ఉచితంగా సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ అన్నారు. గణేష్‌నగర్ కాలనీలో రూ.13.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రమా వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ దశలవారీగా డివిజన్ పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రాల వెంకటేశ్ యాదవ్, గణేష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా..



ఉప్పల్: వయోవృద్ధులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలో ఈస్ట్ కళ్యాణపురి వార్డు కార్యాలయంలో బుధవారం వయోవృద్ధులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ఆయన స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన గెలుపులో వయోవృద్ధుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డా.చెన్నయ్య, రాజశేఖర్, శ్యాంప్రసాద్, సతీష్, రత్నకుమార్‌రెడ్డి, నర్సింగరావు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

అల్వాల్: ఏఐసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశానుసారం బుధవారం అల్వాల్‌లోని పంజాబ్ కమ్యూనిటీ హాలులో 133, 134, 135 డివిజన్ల కాంగ్రెస్ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, సూర్యకిరణ్, కొండల్‌రెడ్డి, మల్లిఖార్జున్, బల్వంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఉదయ్, వెంకటేష్‌గౌడ్, కృష్ణ, బాబు, గౌస్, ఇషాక్, భాస్కర్, విష్ణు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాలను అభివృద్ధి చేయాలి



మర్పల్లిగూడ పంచాయతీ భవనం వద్ద ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎంపీపీలు

ఘట్‌కేసర్: ప్రజలు కోరుకున్న విధంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మర్పల్లిగూడ, మాదారంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, సర్పంచ్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. అయితే, శిలాఫలకంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు పేరు లేకపోవడం, జెడ్పీ చైర్మన్ పేరుని వరుసలో కింద పెట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యాదగిరి, మంగమ్మ, ఉప సర్పంచ్‌లు, నరేశ్, రవి, బాలమణి, ఎంపీటీసీలు శోభారాణి దామోదర్‌రెడ్డి, సరళకుమార్ ముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మాజీ ఎంపీటీసీలు కుమార్ ముదిరాజ్, రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్, ఆనంద్, భిక్షపతి గౌడ్, రవి గౌడ్, వెంకటేశ్ గౌడ్, వేణుగోపాల్, అమర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

కుషాయిగూడ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇంజినీరింగ్ ఏఈ కీర్తి, కుషాయిగూడ హెచ్ఎం బాపురెడ్డి బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం చర్లపల్లి ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈ స్వరూప మెటర్నిటీ లీవ్‌లో వెళ్లగా ఏఎస్‌రావునగర్ ఏఈ కీర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అధికారులు విధుల్లో అంకిత భావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

నీటి సమస్యలకు త్వరలో పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కుషాయిగూడ: త్వరలోనే మంగాపురం కాలనీవాసుల నీటి సమస్యలు తీరనున్నాయని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మంగాపురం కాలనీలో కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. తరచూ కాలనీలో నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుండటంతో నూతనంగా పైప్‌లైన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. పనులను సకాలంలో పూర్తిచేసి కాలనీవాసులకు తాగునీరు అందేలా చూడాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక నేతలు శేఖర్‌గౌడ్, నిస్సార్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రుణాలు



సంఘాల సభ్యులకు చెక్ అందజేస్తున్న మంజుశర్మ తదితరులు

కీసర: మహిళలు ఉత్పత్తి రంగంలో ముందుకొచ్చి బ్యాంకుల నుంచి రుణాలు పొందాలని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మంజుశర్మ సూచించారు. బుధవారం కీసర రైతు వేదిక ప్రాంగణంలో ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మెగా రుణమేళా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంజుశర్మ మాట్లాడుతూ.. మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా రుణమేళాలో ఎస్‌బీఐ చీర్యాల బ్రాంచ్‌లోని 62 సంఘాలకు రూ.5 కోట్ల రుణాలు, కీసర బ్రాంచ్‌లోని 60 సంఘాలకు రూ.5 కోట్లు, ఘట్‌కేసర్, కొర్రెముల్ బ్రాంచ్‌ల పరిధిలోని డ్వాకా సంఘాలకు రూ.5 కోట్ల చొప్పున అందించారు. మొత్తం 180 సంఘాలకు గాను రూ.15 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి పద్మజా రాణి, ఎస్బీఐ డీజీఎం జెన, రీజనల్ మేనేజర్ విజయసారథి, కీసర ఎస్‌బీఐ మేనేజర్ వేణు, చీర్యాల ఎబీఎస్ఐ మేనేజర్ కిరణ్‌కుమార్, ఘట్‌కేసర్ బ్యాంక్ మేనేజర్ ఆకాంక్ష, కొర్రెముల్ మేనేజర్ అనురుధ్, డీపీఎం ప్రభాకర్, లత, తవురియా, నాయక్, సీసీలు, వీఓఏలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం



మల్లాపూర్: కాలనీలో ఉన్న సామాజిక భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ అశోక్‌నగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దశలవారీగా అశోక్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. విద్యా, వైద్య విషయంలో ఏ అవసరం వచ్చినా తనను నేరుగా కలవాలన్నారు. కార్యక్రమంలో అశోక్‌నగర్, నెహ్రూనగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

టెర్మినల్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్. బోస్ అన్నారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గం సమితి సభ్యులు బుధవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించిన వారు పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం బోస్ మాట్లాడుతూ టెర్మినల్ ప్రారంభం నాటికి అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్ ప్రధాన రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎంఎంటీఎస్ పనులు పూర్తయినా సేవలు అందుబాటులోకి రావడం లేదన్నారు. రైల్వే అధికారులు స్పందించి ఎంఎంటీఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి చర్లపల్లి నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, నేతలు నర్సింహ, బానుకుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'ఈసారి మల్కాజిగిరిలో చరిత్ర సృష్టించాలి'



మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: మరోసారి మల్కాజిగిరి పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసి చరిత్ర సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన చర్లపల్లి డివిజన్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పాటుపడాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేటాయించిన రూ.10 కోట్ల నిధులకు సంబంధించి డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం యాదగిరి, సీతారాంరెడ్డి, విఠల్, పోచయ్య, వెంకట్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌గౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీని బుధవారం ఎండోమెంట్ పర్యవేక్షణాధికారి మధుబాబు సమక్షంలో లెక్కించారు. రూ.4,36,905 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఏబీ.రవీంద్రరెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై రమణాచార్యులు, తులసి వెంకటరమణాచార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్, మల్కాజిగిరి మండల ఆర్ఐ శ్రీశైలం, ఆలయ మాజీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, రామదాసు, సంతోష్ ముదిరాజ్, మాజీ ధర్మకర్తలు రవీందర్, గణేష్, మానిక్షి, రత్న మాణిక్యం, సూర్యకుమారి, రాధమ్మ, మాధవి, వెంకటరత్నం, హేమలత, సుబ్బలక్ష్మీ, అనిత, వీణామాధురి, పావని, పద్మజ, హేమలత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: చెట్ల కొమ్మల కొట్టివేతలో భాగంగా సింగపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలో నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఏవీ కన్‌స్ట్రక్షన్స్, కుమ్మరి రాములు బావి, ఇన్ఫోసిస్ కాలనీ, ఐడీబీఎల్ కాలనీలకు విద్యుత్ ఉండదు.

మున్సిపల్ డీఎంఏను కలిసిన కమిషనర్



డీఎంఏ దివ్యను కలిసిన రాజేంద్రకుమార్

కీసర: మున్సిపల్ డీఎంఏ డి.దివ్య(ఐఏఎస్)ను బుధవారం నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలతో పాటు మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు పన్నుల వసూళ్లకు సంబంధించిన వివరాలను డీఎంఏ ఆయన అందించారు.

నియోజకవర్గంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

మేడ్చల్: స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి నేడు నియోజకవర్గంలో పర్యటిస్తూ పలు పంచాయతీల నూతన కార్యాలయాలను ప్రారంభించనున్నారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం, లింగాపూర్ గ్రామ పంచాయతీల భవనాలను ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. 10.30 గంటలకు మూడు చింతలపల్లి మండలం లబ్బూపూర్‌లో రమణగుట్ట భవనం, 11 గంటలకు ఉద్దెమర్రి పంచాయతీ భవనం, 11.30 గంటలకు కీసర మండలం యాద్గార్‌పల్లి పంచాయతీ భవనాలను ప్రారంభించనున్నారు.

ఎస్సైకి సన్మానం



మేడ్చల్ రూరల్: ఇటీవల సేవా పతకం అవార్డు పొందిన మేడ్చల్ ఎస్సై నర్సింహగౌడ్‌ని పట్టణానికి చెందిన పలువురు బుధవారం సన్మానించారు. అవని బిల్డర్స్, ది లైఫ్ జిమ్ కేఆర్‌బీ టీం సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



ఉత్తమ డ్రైవర్లతో సీఐ మహేందర్‌రెడ్డి, మేనేజర్ కవిత

ఘట్‌కేసర్: స్థానిక బస్సు డిపోలో బుధవారం డ్రైవర్ల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన పలువురు ఆర్టీసీ డ్రైవర్లను సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథి సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికులను డ్రైవర్లు సురక్షితంగా గమ్యస్థానాలకు తీసుకొస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఉత్తమ డ్రైవర్లు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అబ్దుల్ సత్తార్ మృతదేహం

కీసర: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుధవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ నివాసి అబ్దుల్ సత్తార్(58) బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన స్కూటీపై కీసర నుంచి అంకిరెడ్డిపల్లి వైపు వెళ్తున్నాడు. పెద్దమ్మ చెరువు సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద తన స్కూటీ ముందు టైర్ స్కిడ్ కావడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.